విద్యార్థులకు స్వర్ణామృత ప్రాశన అందజేత


విద్యార్థులకు ప్రాశన అందజేస్తున్న బైలూర్ యోగిష్ ప్రభు

కూకట్‌పల్లి: వికాస్ తరంగిణి అధ్యక్షులు బైలూర్ యోగిష్ ప్రభు ఆధ్వర్యంలో పుష్యమి నక్షత్ర రోజును పురస్కరించుకొని చిన్నారులకు స్వర్ణామృత ప్రాశన అందజేశారు. 16 సంవత్సరాలలోపు పిల్లలకు ప్రతి నెలా ఈ స్వర్ణామృత ప్రాశన అందజేస్తున్నామని తెలిపారు. కేపీహెచ్‌బీకాలనీ ఎంఐజీ–578లో మంగళవారం పిల్లలకు అందజేశారు. ఈ స్వర్ణామృత ప్రాశన తింటే పిల్లల్లో మేధాశక్తిని పెరుగుతుందన్నారు.

పాఠశాలలో శ్రీరామ నవమి వేడుకలు

కూకట్‌పల్లి: భాగ్యనగర్‌కాలనీలోని నారాయణ ఈకేపీ బ్రాంచ్‌లో శ్రీరామ నవమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు రాముడు, సీత, లక్ష్మణ, హనుమంతుడి వేషధారణలతో అలరించారు. పాఠశాల యాజమాన్యం మాట్లాడుతూ.. పిల్లలకు చిన్ననాటి నుంచే సంస్కృతి, సంప్రదాయాలు నేర్పిస్తున్నామని అన్నారు. శ్రీరామనవమి విశిష్టతను పిల్లలకు వివరించామన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఏజీఎం వేణుగోపాల్, ప్రిన్సిపల్ లక్ష్మీ సుజాత, వైస్ ప్రిన్సిపాల్ లక్ష్మీకుమారి,టీచర్స్ పాల్గొన్నారు.

'చిరుధాన్యాల ఆరంభం' స్టోర్ ప్రారంభం

మాదాపూర్: ప్రతి గింజలో పోషక విలువలు ఎక్కువగా ఉంటాయని సినీనటి రకూల్‌ప్రీత్‌సింగ్ అన్నారు. మాదాపూర్‌లో క్యూర్‌ఫుడ్స్‌తో కలిసి ఆరంభం స్టోర్‌ను మంగళవారం ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరూ చిరుధాన్యాలను జీవనశైలిలో భాగస్వామ్యం చేసుకోవాలని తెలిపారు. పోషకవిలువలతో నిండిన చిరుధాన్యాలను వాడటం వల్ల మంచి ఆరోగ్యం, శారీరక సామర్థ్యం పెరుగుతుందన్నారు. క్యూర్ ఫుడ్స్ వ్యవస్థాపకుడు అంకిత్ నాగోరి తదితరులు పాల్గొన్నారు.

ప్రజలందరూ ఆయురారోగ్యాలతో ఉండాలి


స్వామివారిని దర్శించుకుంటున్న జగదీశ్వర్‌గౌడ్, గొట్టిముక్కల వెంకటేశ్వరరావు

ఆల్విన్‌కాలనీ: వివేకానందనగర్ కాలనీలోని వేంకటేశ్వరస్వామి ఆలయం 33వ బ్రహ్మోత్సవాల వైభవంగా జరుగుతున్నాయి. ఈ వేడుకలకు శేరిలింగంపల్లి కాంగ్రెస్ ఇన్‌చార్జి జగదీశ్వర్‌గౌడ్, సీనియర్ నాయకుడు గొట్టిముక్కల వెంకటేశ్వరరావు మంగళవారం హాజరై స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా వేదపండితులు వారిని ఆశీర్వదించి ప్రసాదం అందజేశారు. ఈ సందర్భంగా జగదీశ్వర్‌గౌడ్ మాట్లాడుతూ.. వేంకటేశ్వరస్వామి దయతో ప్రజలందరూ ఆయురారోగ్యాలతో ఉండాలని కోరుకున్నట్లు పేర్కొన్నారు.

దేవాలయానికి విరాళం


విరాళం అందజేస్తున్న కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్‌గౌడ్

ఆల్విన్‌కాలనీ: ఎల్లమ్మబండ పరిధిలోని కమలమ్మ కాలనీలోని శ్రీఅభయ వీరాంజనేయస్వామి, వరసిద్ధి వినాయక విగ్రహ ప్రతిష్ఠాపనోత్సవం జరిగింది. ఈ వేడుకకు ముఖ్యఅతిథిగా కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్‌గౌడ్ హాజరై ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా డీవీజీ ట్రస్ట్ ద్వారా దేవాలయానికి రూ.21వేలను విరాళంగా అందజేశారు. ఈ కార్యక్రమంలో పాండుగౌడ్, రాజు పటేల్, కృష్ణారావు, మల్లేష్, మురళి, శంకర్‌రావు, ఉమామహేశ్వరరావు, శంకర్ గౌడ్, పద్మయ్య తదితరులు పాల్గొన్నారు.



శ్రీసీతారాముల కల్యాణం చూద్దాం రారండి

శ్రీరామ నవమి పర్వదినాన్ని పురస్కరించుకొని కూకట్‌పల్లి పరిధిలోని దేవాలయాలు, కాలనీలు ముస్తాబయ్యాయి. హిందువుల ఆరాధ్య దైవమైన శ్రీరాముడి కల్యాణ మహోత్సవం, పట్టాభిషేకం ఘనంగా నిర్వహించేందుకు భక్తులు కాలనీలు, బస్తీలను శ్రీరాముడి బ్యానర్లు, కాషాయ తోరణాలతో అలంకరించుకుంటున్నారు. సీతారాముల ఉత్సవ మూర్తులతో తీసే భారీ ఊరేగింపు ఏర్పాట్లలో రామ భక్తులు నిమగ్నమయ్యారు. సీతారాముల కల్యాణోత్సవం అనంతరం ఆలయాలు, కాలనీలు, బస్తీల్లో భక్తులకు అన్నదాన కార్యక్రమాలు ఉంటాయని నిర్వాహకులు తెలిపారు. – మూసాపేట

- శ్రీరామనవమి ఉత్సవాలకు సర్వం సిద్ధం
- చలువ పందిళ్ల ఏర్పాటు, విద్యుద్దీపాల వెలుగులో దేవాలయాలు
- వాడవాడలా సీతారాముల కల్యాణానికి ఏర్పాట్లు పూర్తి
- శ్రీరాముడి పట్టాభిషేకాలతో పరవశించనున్న భక్తులు




భరత్‌నగర్‌కాలనీలోని హరిహర క్షేత్రంలో ఏర్పాటు చేసిన చలువ పందిరి


మూసాపేటలోని శ్రీసాయిబాబా ఆలయ ప్రాంగణంలో చలువ పందిరి ఏర్పాటు

మూసాపేట: శ్రీరామనవమిని పురస్కరించుకొని కూకట్‌పల్లి సర్కిల్‌లో పరిధిలోని దేవాలయాలు విద్యుద్దీపాల వెలుగులో కళకళలాడుతున్నాయి. బుధవారం తెల్లవారుజాము నుంచే ప్రత్యేక పూజలు నిర్వహించనున్నారు. ఎండలను దృష్టిలో పెట్టుకుని దేవాలయాల్లో కూలర్లు, తాగునీటి వంటి అన్ని మౌలిక సదుపాయాలు కల్పిస్తున్నారు.

◆ ప్రగతినగర్ కాలనీలోని ఆంజనేయస్వామి ఆలయం, జనతానగర్ కాలనీలోని ఆంజనేయస్వామి దేవాలయం, గూడ్స్‌షెడ్ రోడ్డులోని వీర హనుమాన్ ఆలయం, కూకట్‌పల్లిలోని పట్టాభి సీతారామచంద్రస్వామి ఆలయం, వివేకానందనగర్‌లోని సప్తగిరికాలనీలో వేంచేసి ఉ శ్రీసీతారామచంద్రస్వామి దేవాలయం, కేపీహెచ్‌బీకాలనీలో పలు దేవాలయాల్లో కోదండ రాముడి కల్యాణం అంగరంగ వైభవంగా నిర్వహించనున్నారు.

అదే విధంగా భరత్‌నగర్‌కాలనీలోని హరిహర క్షేత్రంలో 12.15 నిమిషాలకు కల్యాణం, సాయంత్రం 6 గంటలకు హనుమత్ వాహన సేవ, ఊరేగింపు ఉంటుందని ఆలయ కార్యనిర్వహణాధికారి తెలిపారు. అదే విధంగా మూసాపేటలోని శ్రీ సాయిబాబా ఆలయంలో కల్యాణ మహోత్సవం ఉంటుందని ఆలయ నిర్వాహకులు మున్నా తెలిపారు. ఆంజనేయనగర్ కాలనీలోని శ్రీప్రసన్న వేంకటేశ్వరస్వామి ఆలయంలో సీతారాముల కల్యాణం, అన్నదాన కార్యక్రమం వంటి కార్యక్రమాలు ఉంటాయని ఆలయాల కమిటీ సభ్యులు తెలిపారు.

ఆల్విన్‌కాలనీ ఫేజ్–1 సమస్యలను పరిష్కరిస్తా


ఫేజ్-1 సమస్యలపై కాలనీ అసోసియేషన్ సభ్యులతో మాట్లాడుతున్న కార్పొరేటర్

కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్‌గౌడ్

ఆల్విన్‌కాలనీ: ఆల్విన్‌కాలనీ డివిజన్ కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్‌గౌడ్ ఆల్విన్‌కాలనీ ఫేజ్–1 అసోసియేషన్ సభ్యులను మంగళవారం మర్యాదపూర్వకంగా కలిసి కాలనీ సమస్యలపై చర్చించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కాలనీలో ఉన్న తాగునీరు, సీసీ రోడ్ల సమస్యలను త్వరగా పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో చేవెళ్ల పార్లమెంట్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి గడ్డం రంజిత్‌రెడ్డిని అత్యధిక మెజార్టీతో గెలిపించేందుకు మనందరం కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో యువనేత దొడ్ల రామకృష్ణగౌడ్, సమ్మారెడ్డి, బి. వెంకటేష్‌గౌడ్, సంపత్‌రెడ్డి, కృష్ణగౌడ్, నరసింగరావు, రఘు, రామ్‌రెడ్డి, సోమయ్యగౌడ్, నరసింహారెడ్డి, మనోహర్‌రెడ్డి, వెంకటస్వామి, ఖదీర్ పాషా తదితరులు పాల్గొన్నారు.

కూరగాయల ధరలు

కూకట్‌పల్లి: కూకట్‌పల్లి రైతుబజార్‌లో కూరగాయల ధరలు కిలో రూపాయల్లో టమాట 13, వంకాయ 35, బెండకాయ 45, పచ్చిమిర్చి 55, బజ్జిమిర్చి 28, కాకరకాయ 35, బీరకాయ 45, క్యాబేజి 19, బీన్స్ 50, క్యారెట్ 21, గోబిపువ్వు 18, దొండకాయ 19, చిక్కుడుకాయ 50, గోరు చిక్కుడు 35, బీట్‌రూట్ 19, క్యాప్సికం 60, ఆలుగడ్డ 34, కీరా 23, దోసకాయ 16, సొరకాయ 9, పొట్లకాయ 18, కంద 70, ఉల్లిపొరక 40, ఉల్లిగడ్డ 20, మామిడికాయ 10 నుంచి 15, అరటికాయ 8 నుంచి 9, చామగడ్డ 35, ముల్లంగి 4 నుంచి 5, చిలగడ దుంప 18, గుమ్మడికాయ 40లుగా ఉన్నాయి.

ప్రథమ చికిత్స కేంద్రం సీజ్

సాక్షి, మేడ్చల్ జిల్లా: రాష్ట్ర వైద్య మండలి చైర్మన్ ఆదేశాల మేరకు మేడ్చల్–మల్కాజిగిరి జిల్లాలోని గుండ్లపోచంపల్లి కవిత ప్రథమ చికిత్సా కేంద్రాన్ని సీజ్ చేసినట్లు డీఎంహెచ్‌ఓ డాక్టర్ రఘునాథ స్వామి తెలిపారు. ఎలాంటి అర్హతలు లేని నకిలీ వైద్యులు కవిత ప్రథమ చికిత్స కేంద్రంలో రోగులను పరీక్షించి, మందులు అందజేస్తున్నట్లు తాము నిర్వహించిన తనిఖీల్లో వెల్లడైందన్నారు. నేషనల్ మెడికల్ కమిషన్ నిబంధనలు, టీఎస్‌ఎంసీ చట్టం ప్రకారం అవసరమైన చర్యలు తీసుకోనున్నట్లు తెలిపారు. ఈ చికిత్సా కేంద్రంపై పోలీసు కేసు నమోదైనట్లు డీఎంహెచ్‌ఓ పేర్కొన్నారు.

సమాజ సేవకుడు వైష్టవీ ప్రసాద్‌ను ఆదరించాలి


వైష్టవీ ప్రసాద్ ఎన్నికల మేనిఫెస్టోను విడుదల చేస్తున్న స్వరూపానందేంద్ర స్వామి, స్వాత్మానందేంద్ర స్వామితదితరులు

నాగోలు: సమాజంలోని అన్ని వర్గాల ప్రజలకు సహాయ సహకారాలు అందించేది బ్రాహ్మణ జాతేనని విశాఖ శ్రీశారదా పీఠాధిపతులు శ్రీ స్వరూపానందేంద్ర సరస్వతి మహాస్వామి అన్నారు. విశాఖ శారద పీఠం ఉత్తరాధికారి స్వాత్మానందేంద్ర సరస్వతి స్వామితో కలిసి కొత్తపేట మోహన్‌నగర్‌లోని మల్కాజిగిరి ఎంపీ స్వతంత్ర అభ్యర్థి శ్రీ వైష్ణవీ ప్రసాద్ (పెండ్యాల శేషసాయి వరప్రసాద్) నివాసానికి విచ్చేశారు. ఈ సందర్భంగా వైష్ణవీ ప్రసాద్ ఎన్నికల మేనిఫెస్టోను ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా స్వరూపానందేంద్ర సరస్వతి మాట్లాడుతూ, దేశానికి స్వాతంత్ర్యం రాకపూర్వం బ్రిటీష్ పాలనా కాలం నుంచీ ఆలయాలను రక్షించింది బ్రాహ్మణ జాతి మాత్రమేనని అన్నారు. భారతీయ సంస్కృతీ సంప్రదాయాల పరిరక్షణ బ్రాహ్మణ జాతితోనే సాధ్యమైందని అన్నారు. ఈ బ్రాహ్మణ సమాజానికి అండగా తాను ఉన్నానని, కేవలం బ్రాహ్మణ జాతికే కాకుండా ఇతరులకూ అండగా ఉంటానని ముందుకు వచ్చిన వైష్ణవీ ప్రసాద్‌ను అందరూ బలపర్చి పార్లమెంట్ ఎన్నికల్లో మల్కాజిగిరి ఎంపీగా గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ దేవాదాయ శాఖ సలహాదారు జ్వాలాపురం శ్రీకాంత్, జంటనగరాల బ్రాహ్మణ సంఘాల సమాఖ్య పూర్వ అధ్యక్షుడు తులసి శ్రీనివాస్, వారణాసి వంశీ, ద్రోణంరాజు రవికుమార్, వక్కలంక శ్రీనివాస్ రావు, మునిపల్లె శ్రీనివాస్, అరుణ, రాజేశ్వరి, రత్న, వనస్థలిపురం, దిల్‌సుఖ్‌నగర్, మీర్‌పేట తదితర ప్రాంతాల బ్రాహ్మణ సంఘాల నాయకులు పాల్గొన్నారు.

'మాదిగలకు కాంగ్రెస్ ఒక్క సీటు ఇవ్వలేదు'

ఎంఎస్పీ రంగారెడ్డి జిల్లా అధ్యక్షులు రావుగాళ్ల బాబుమాదిగ


మాట్లాడుతున్న ఎంఎస్పీ జిల్లా అధ్యక్షుడు రావుగాళ్ల బాబు

రాయదుర్గం: రాష్ట్రంలో ఎంపీ ఎన్నికల్లో కాంగ్రెస్ ఒక్క సీటు కూడా మాదిగలకు ఇవ్వకుండా వర్గీకరణ చేస్తామంటే నమ్మేదెవరని ఎంఎస్పీ రంగారెడ్డి జిల్లా అధ్యక్షులు రావుగాళ్ళ బాబుమాదిగ అన్నారు. మంగళవారం రాయదుర్గంలో ఎంఎస్పీ, ఎమ్మార్పీఎస్ ముఖ్య నాయకులతో ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. మాదిగలకు సమాధానం చెప్పలేకే అబద్ధాలు చెప్తున్న సీఎం, ఆ స్థాయిలో ఉండి ప్రజల ముందు అబద్ధాలు చెప్పడం సరికాదన్నారు. మాదిగలకు పార్లమెంటుకు వెళ్లేందుకు అవకాశం ఇవ్వనోళ్లు వర్గీకరణ చేస్తామనడం హాస్యాస్పదమన్నారు. మందకృష్ణ మాదిగకు వచ్చిన బెయిల్‌కు రేవంత్‌రెడ్డికి సంబంధమేలేదని, మాదిగలను కాంగ్రెస్ పార్టీ దూరం చేసిన చరిత్ర రేవంత్‌రెడ్డిదని ఆయన విమర్శించారు. 'మాలలు కుర్చీ లాక్కుంటారో లేదోగానీ.. మాదిగలు మాత్రం పోరాడి కుర్చీ నుంచి ఆయనను దించడం ఖాయమని' ధీమా వ్యక్తం చేశారు. ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షులు పెంటనోళ్ళ నర్సింహ్మ మాదిగ, ఎమ్మార్పీఎస్, ఎంఎస్పీ నాయకులు గణేష్, రమేష్, నరేష్, కొడిచెర్ల ప్రేమ్ తదితరులున్నారు.

ఎగ్జిక్యూటివ్ ఎంబీఏ కోర్సు

వర్కింగ్ ప్రొఫెషనల్స్ కోసం ప్రత్యేక కోర్సు

రాయదుర్గం: హెచ్‌సీయూలో మరో కొత్త కోర్సుకు శ్రీకారం చుట్టారు. ముఖ్యంగా వర్కింగ్ ప్రొఫెషనల్స్ కోసం ప్రత్యేకంగా ఈ కోర్సును ఏర్పాటు చేశారు. ఎగ్జిక్యూటివ్ ఎంబీఏ కోర్సును వినూత్న బోధనా విధానం ద్వారా బోధించేలా ఏర్పాట్లు చేయడం విశేషం. ఈ కోర్సు తరగతులను ప్రొఫెషనల్స్‌కు అనుకూలంగా ఉండేలా శని, ఆదివారాల్లో నిర్వహించాలని నిర్ణయించారు. వినూత్న బోధనా విధానం నుంచి ప్రయోజనం పొందేందుకు వ్యక్తిగత తరగతులు పనిచేసే నిపుణులకు సహాయపడతాయని హెచ్‌సీయూ అధికారులు ప్రకటించారు. ఇంటరాక్టివ్ లెక్చర్ మెథడ్స్‌తోపాటు హార్వర్డ్, సేజ్ నుంచి వచ్చిన కేసులను ఉపయోగించి పరిశ్రమకు సంబంధించిన సిలబస్ బోధించబడుతుంది. ఈ కోర్సులు స్కూల్ ఆఫ్ మేనేజ్‌మెంట్ స్టడీస్, విశ్వవిద్యాలయంలోని ఇతర విభాగాల నుంచి అనుభవజ్ఞులైన అధ్యాపకులచే బోధించేందుకు ఏర్పాట్లు చేశారు. ఎంపిక చేసిన కోర్సులను ప్రీమియర్ బిజినెస్ స్కూళ్ల నుంచి అధ్యాపకులు, పరిశ్రమకు చెందిన అభ్యాసకులు బోధిస్తారు. మరిన్ని వివరాలకు వెబ్‌సైట్‌ను సంప్రదించగలరు.

అఫిడవిట్‌లో తప్పులుంటే.. అభ్యర్థులకు తిప్పలే..!

రేపటి నుంచి నామినేషన్ల ఘట్టం ప్రారంభం

- అన్ని కాలమ్స్ పూరించాల్సిందే..
- నేర సమాచారం తప్పనిసరిగా ఉండాలి
- ఆస్తులు, అప్పులు పక్కా ప్రస్తావించాలి
- అభ్యర్థుల వివరాలు తెలుసుకోవడం ఓటర్ల హక్కు

సాక్షి, మేడ్చల్ జిల్లా: ఎన్నికల ప్రక్రియలో భాగంగా నామినేషన్లు దాఖలు సందర్భంగా అభ్యర్థులు సమర్పించే అఫిడవిట్ కీలకంగా మారుతోంది. అభ్యర్థులు తమ వివరాలతో పాటు ఆస్తులు, అప్పుల గురించి ప్రమాణ పత్రం రూపంలో ముందే స్పష్టం చేయాల్సి ఉంటోంది. గతంలో ఏమైనా కేసులు ఉన్నా.. శిక్ష పడినా వాటిని పొందుపరచాలి. వీటిని కలిపి దాఖలు చేసే పత్రమే అఫిడవిట్. అందులో తప్పుడు సమాచారమిస్తే మాత్రం అదే ప్రత్యర్థులకు ఆయుధమై కోర్టు కేసుల వరకు వెళ్లడమే కాకుండా అనర్హత వేటుకు దారితీసే అవకాశం ఉంటుంది. గురువారం నుంచి పార్లమెంట్ సాధారణ ఎన్నికలకు నామినేషన్ల ఘట్టం ప్రారంభం కానుండటంతో అభ్యర్థులు నామినేషన్ దాఖలు సందర్భంగా సమర్పించే అఫిడవిట్‌లో తప్పులు లేకుండా చూసుకోవాల్సి బాధ్యత వారిపైనే ఉంటుంది.

వివరాలు తెలుసుకోవడం ఓటర్ల హక్కు

ప్రజాప్రతినిధిగా ఎన్నుకోబోయే అభ్యర్థి వివరాలను తెలుసుకోవడం ఓటర్ల హక్కు. అప్పుడే అభ్యర్థులపై ఓ స్పష్టత వస్తోంది. ఇదే విషయాన్ని కేంద్ర ఎన్నికల సంఘం స్పష్టం చేస్తోంది. అందులో భాగంగానే అభ్యర్థులు తమ నామినేషన్‌తో పాటు అఫిడవిట్‌ను దాఖలు చేయాల్సి ఉంటుంది. ఎన్నికల నిబంధనలకు లోబడి ఫామ్–26 రూపంలో అభ్యర్థులు అఫిడవిట్ సమర్పించాల్సి ఉంటోంది. ఇందులో అభ్యర్థుల ఆస్తులు, అప్పులు, కేసుల సమాచారంతో పాటు కుటుంబ సభ్యుల వివరాలు తెలపాల్సి ఉంటుంది.

అన్నీ కాలమ్స్ పూరించాల్సిందే..

అఫిడవిట్‌లోని ఏ ఒక్క కాలమ్ ఖాళీగా వదలరాదని ఎన్నికల సంఘం(ఈసీ) స్పష్టం చేస్తోంది. అభ్యర్థులకు సంబంధం లేకపోతే ఆ కాలమ్‌లో 'నిల్ లేదా వర్తించదు' అని రాయాలని తెలిపింది. అభ్యర్థి సమర్పించిన అఫిడవిట్‌ను గమనించి ఏదైనా సమాచారం లేకపోతే ఆర్‌ఓ నోటీసు ఇస్తారు. అప్పుడు సవరించిన అఫిడవిట్‌ను అభ్యర్థి అందించాల్సి ఉంటోంది. అయినప్పటికీ పూర్తిస్థాయి వివరాలతో అఫిడవిట్ లేకపోతే పరిశీలన (స్క్రూటినీ) సమయంలో నామినేషన్ తిరస్కరణకు గురవుతోంది. అభ్యర్థులు దాఖలు చేసిన అఫిడవిట్లను ఆర్‌ఓలు నోటీసు బోర్డు, వెబ్‌సైట్లో పొందుపరుస్తారు.

నేర సమాచారం తప్పనిసరి

క్రిమినల్ కేసులు నమోదై ఉంటే వాటి వివరాలను అఫిడవిట్‌లో పొందుపరచాల్సి ఉంటోంది. ఏదైనా కేసులో న్యాయస్థానాలు గతంలో శిక్ష విధించినా, అప్పీల్‌కు వెళ్లినా వాటి సమాచారాన్ని ప్రస్తావించాల్సి ఉంటోంది. సామాజిక మాధ్యమాల ఖాతాలను తెలిపాల్సి ఉంటోంది. అన్ని వివరాలతో కూడిన అఫిడవిట్‌కు నోటరీ తప్పనిసరి. సాధారణంగా నామినేషన్ దాఖలు సమయంలో రిటర్నింగ్ అధికారి(ఆర్‌ఓ) ముందు అభ్యర్థి ప్రమాణం చేస్తారు. వేరే ఎవరైనా నామినేషన్ సమర్పిస్తే సదరు అభ్యర్థి తాను ఉన్న ప్రాంతంలోని మెజిస్ట్రేట్ ముందు ప్రమాణం చేయాల్సి ఉంటుంది. అంతేగాకుండా అభ్యర్థులపై నమోదైన కేసుల వివరాలను ప్రముఖ దినపత్రికల్లో స్పష్టంగా కనిపించేలా ప్రకటన ఇవ్వాల్సి ఉంటోంది.



ఆస్తులు, అప్పులను పక్కాగా ప్రస్తావించాల్సిందే..

స్థిర, చరాస్తుల వివరాలతో పాటు చేతిలో, బ్యాంకు ఖాతాల్లోని నగదు, డిపాజిట్లు, ఇతర సేవింగ్స్, బీమా పాలసీలు, అప్పులు తదితరాలు పొందుపర్చాల్సి ఉంటోంది. ఆభరణాలు, వాహనాలు, వ్యవసాయ భూములు, వాణిజ్య సముదాయాలు, నివాస స్థలాల వంటి వాటిని అఫిడవిట్లో ప్రస్తావించాలి. అవి వారసత్వంగా వచ్చాయా.. కొనుగోలు చేశారా అన్నది కూడా తెలపాల్సి ఉంటోంది. స్థిరాస్తులకు సంబంధించిన ప్రస్తుత మార్కెట్ విలువను పొందుపర్చాల్సి ఉంటోంది.అభ్యర్థితో పాటు కుటుంబ సభ్యుల పేరిట రుణాలు ఉంటే వాటి వివరాలనూ ప్రస్తావించాలి. కుటుంబ సభ్యుల ఆదాయ మార్గాలు, ప్రభుత్వం లేదా ప్రైవేటు కంపెనీల కాంట్రాక్టులు ఉంటే వాటి వివరాలు తెలియజేయాల్సి ఉంటోంది. అభ్యర్థులు ఫామ్–26 ద్వారా అఫిడవిట్‌ను ఎన్నికల నిబంధనలకు లోబడి సమర్పించాల్సి ఉంటోంది. ఆస్తులు, అప్పులు, నేర వివరాలు కచ్చితత్వంతో ఉండాల్సి ఉంది. తప్పుడు సమాచారమిస్తే న్యాయపరమైన చిక్కులను ఎదుర్కోవాల్సి ఉంటోంది.

కేంద్రంలో మరోసారి మోదీ ప్రభుత్వమే..

ఇంటింటికీ బీజేపీ కార్యక్రమంలో వడ్డేపల్లి రాజేశ్వరరావు

కూకట్‌పల్లి: ప్రపంచ దేశాల్లో భారతదేశాన్ని అగ్రగామిగా నిలిపిన నరేంద్ర మోదీ ప్రభుత్వమే మరోసారి అధికారంలోకి వస్తుందని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు వడ్డేపల్లి రాజేశ్వరరావు అన్నారు. మంగళవారం బాలాజీనగర్ డివిజన్‌లోని శ్రీ ప్రసన్న వేంకటేశ్వరస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం 'ఘర్ ఘర్ పే భాజాపా' కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా స్థానికులను కలుస్తూ ఇంటింటికి కరపత్రాలను పంపిణీ చేశారు.

'నరేంద్ర మోదీ గ్యారంటీ... ఈటల షూరిటీ'

◆ ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... మల్కాజ్‌గిరి ఎంపీగా ఈటల రాజేందర్‌ను ఎందుకు ఎన్నుకోవాలో వివరిస్తున్నామని అన్నారు. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న, అమలు చేసిన వివిధ పథకాలను ప్రజలకు తెలుపుతున్నామని పేర్కొన్నారు. ప్రజానాయకుడు ఈటల రాజేందర్‌ను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. 'నరేంద్ర మోదీ గ్యారంటీ... ఈటల షూరిటీ'అంటూ నినాదాలు చేశారు.

◆ ఈ కార్యక్రమంలో నియోజకవర్గ ఇన్‌చార్జి మాధవరం కాంతారావు, జిల్లా కన్వీనర్ మల్లారెడ్డి, జిల్లా కోకన్వీనర్ పద్మయ్య, అసెంబ్లీ కన్వీనర్ శ్రీకర్‌రావు, మూసాపేట కార్పొరేటర్ మహేందర్, జిల్లా సెక్రటరీ శైలేష్, డివిజన్ అధ్యక్షులు వినోద్, బీజేవైఎం జిల్లా ఉపాధ్యక్షులు తిరుపతిరెడ్డి, ఓబీసీ అసెంబ్లీ కన్వీనర్ కొడిచెర్ల వినోద్, శ్రీనివాసాచారి, మహిళా మోర్చా అధ్యక్షురాలు జ్యోతి, జిల్లా కార్యవర్గ సభ్యులు సోమశేఖర్‌రెడ్డి, రేణుక, సుధారవి, జగదీష్, సూరిబాబు, రేణుక తదితరులు పాల్గొన్నారు.


సుమిత్రానగర్‌లో ప్రచారం చేస్తున్న బీజేపీ నాయకులు

ఈటలకు అఖండ విజయాన్ని ఇవ్వాలి

కూకట్‌పల్లి: మల్కాజ్‌గిరి లోక్‌సభ ఎంపీ అభ్యర్థి ఈటల రాజేందర్‌ని గెలిపించాలని మంగళవారం బీజేపీ నాయకులు జోరుగా ప్రచారం చేశారు. కూకట్‌పల్లి సుమిత్రానగర్‌లో నాయకులు, కార్యకర్తలు ఇంటింటికీ వెళ్లి కరపత్రాలను పంపిణీ చేశారు. ఈటల రాజేందర్‌కు ఓటు వేసి అఖండ విజయాన్ని ఇవ్వాలని ఓటర్లను అభ్యర్థించారు.



బాలాజీనగర్ డివిజన్‌లో బీజేపీకి ఓటు వేయాలని కరపత్రాలను ఓటర్లకు అందజేస్తున్న మాధవరం కాంతారావు, వడ్డేపల్లి రాజేశ్వరరావు, కార్యకర్తలు